విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 26, జూలై 2024

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి..

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండలపరిధి లోని పులకుర్తి గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లికేతికి చెందిన రామకృష్ణ(35) తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గురువారం మధ్యాహ్నం పులకుర్తి గేటు వద్ద ద్విచక్ర వాహనంలో వెళుతున్న రామకృష్ణను మైన్స్‌లారీ ఒక్కసారిగా ఢీ కొనడంతో ఆయన తీవ్ర గాయాలపాలైయారు. దీంతో 108కు సమాచారం అందించడంతో సిబ్బంది ఇయంట గోపాలి వన్నూరు స్వామి, బొగ్గుల ప్రసాద్‌లు హుటాహుటిన అక్కడికి చేరుకొని క్షత గాత్రుడికి ప్రథమ చికిత్స అందించి బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి చేర్పినట్లు తెలిపారు. హుటాహుటిన స్పందించిన 108 సిబ్బందికి బాధితుని బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యాహ్న భోజనాన్ని పునఃప్రారంభించేంతవరకు పోరాడుతాం..!

ఆర్డీవో కార్యాలయం ముందు పెద్దఎత్తున ధర్నా
పేద విద్యార్థులకు ప్రభుత్వాలు అండగా నిలవాలి

విశాలాంధ్ర-కళ్యాణదుర్గంటౌన్: ప్రభుత్వ కళాశాలలలో ఇంటర్ విద్యను అభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని పునః ప్రారంభించేంతవరకు పోరాడుతామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్రకార్యవర్గ సభ్యులు హనుమంత నాయుడు పేర్కొన్నారు. గురువారం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్‌తో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి వందలాది మంది విద్యార్థిని విద్యార్థులతో పెద్దఎత్తున ర్యాలీగా వెళ్లి ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో బీసీ, ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఉండేదని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొచ్చిన తర్వాత పేద విద్యార్థుల కడుపు కొట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలని, జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాలు పాడు పడ్డాయని వాటిని త్వరితగదన మరమ్మతులు చేపట్టి పేద విద్యార్థిని విద్యార్థులకున్యాయం చేయాలన్నారు. పెరిగినధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు పెంచాలన్నారు. పేద విద్యార్థిని విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహాలలో కనీస వసతులు లైట్లు, ఫ్యాన్లు, బాత్రూం,ప్రహరీ గోడ సుధాకర్ కూడా సక్రమంగా లేవన్నారు. వసతి గృహాల్లో ట్యూటర్లుగా పని చేస్తున్న వారికి నేటికీ జీతాలు లేక నానాఅవస్థలు పడుతున్నారని వారికి న్యాయం చేస్తే పేదవిద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. న్యాయమైన సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియో జకవర్గ ఉపాధ్యక్షులు నవీన్, శైలు, స్రవంతి, సహాయ కార్యదర్శి అజయ్,పట్టణఅధ్యక్షులు హర్షవర్ధన్ ఉపాధ్యక్షులు సాయి పవన్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆది కేశవులు హత్య కేసులో నిందితులు అరెస్ట్

విశాలాంధ్ర-రాయదుర్గం టౌన్: ఈనెల 9న మేచ్చిరి గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకుడు గొల్ల కొత్తపల్లి ఆదికేశవులు హత్య జరిగిన సంఘటనలో నిందితులను అరెస్టు చేసినట్లు డి.ఎస్.పి శ్రీనివాసులు గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలే ప్రధాన ముద్దాయి కేశవరెడ్డి కోర్టులో లొంగిపోయారన్నారు. ప్రధాన నిందితులైన కాపు చంద్రశేఖర్ రెడ్డి తో పాటు మరో పదిమంది నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామంలో సాక్షాలు, విచారణ చెయ్యగా హత్యకు ప్రధానంగా మూడు కారణాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. హత్య కు గురైన ఆది కేశవుల వర్గానికి, కాపు చంద్రశేఖర్ రెడ్డి వర్గానికి మూడు సంవత్సరాలుగా వర్గ విభేదాలు ఉన్నాయన్నారు. గత ఒకటిన్నర సంవత్సరాల క్రితం గడ్డివాము విషయంలో ఇరువర్గాల వారు శిక్ష అనుభవించారన్నారు. అయితే ఇటీవల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం అర్చకుల విషయంలో ఆది కేశవులు ఇతరులను అర్చకులుగా నియమించడాన్ని ఓర్చలేక, ఇటీవలే రాజకీయాల్లో ఎదగడాన్ని సహించలేక పాతవిభేదాలన్నీ మనసులో ఉంచుకొని కాపు చంద్రశేఖర్ రెడ్డి అనుచరులు ఆదికేశవులను హత్య చేశారన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. ఆదికేశవులు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ శ్రీనివాసులు, సిబ్బంది శ్రమించి నిందితులను పట్టుకున్నందుకు వారిని అభినందించారు.

ప్లాస్టిక్ నిషేధంపై గ్రామసభ నిర్వహించిన అధికారులు

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని పంచాయితీ కార్యాలయ ఆవరణంలో సర్పంచు పందు అనురాధ అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్ హాజరై గ్రామసభలో మాట్లాడుతూ ముఖ్యఅజెండా అయిన ప్లాస్టిక్ నిషేధం ప్రజలు, దుకాణదారులు వీలైనంత తొందరగా ప్లాస్టిక్ వినియోగం మానుకోవాలని కోరారు. ఇంత వరకు ఇంకా ఎవరు అయినా మరుగుదొడ్లు లేని వారు ఉంటే పంచాయితీ అధికారుల దృష్టికి తీసుకోని వస్తే వారికి మరుగుదొడ్ల నిర్మాణం చెప్పట్టే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. యాడికి గ్రామపంచాయితీలో సెప్టెంబర్ నెలాఖరు నాటికి ప్లాస్టిక్ నిషేధం చేస్తున్నట్లు తీర్మానం చేశారు. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వాడకం నియంత్రించి మన ఆరోగ్యం,పర్యావరణాన్ని కాపాడు కోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్డీ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్వైజర్ విజయకుమారి, సర్పంచ్ పందు అనురాధ,ఎంపీటీసీ సభ్యులు వెంకటనాయుడు, అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్, వార్డ్ సభ్యులు గుంత తిరుపతి, రామచంద్ర, ఎస్సీ సెల్ కన్వీనర్ శ్రీరాములు, కోటచౌదరి, పంచాయితీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది,దుకాణదారులు పాల్గొన్నారు.

పరిశ్రమల యాజమాన్యం రైతుల మధ్య ఘర్షణ

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండల పరిధిలోని నేమకల్లు గ్రామ శివారులోని స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీలు ద్వారా వచ్చే పొల్యూషన్‌తో పంట పొలాలు దెబ్బతింటున్నాయని, యాజమాన్యం అరకొరగా పరిహారం అందించి చేతులు దులుపు కుంటున్నారని, రైతులు కొన్ని రోజులుగా ఆరోపిస్తూ సీపీఐ నాయకులు కలిసి కలెక్టరేట్‌ను గత వారం ముట్టడించారు. ఈనేపథ్యంలో గురువారం పొల్యూషన్ అధికారులు మహేష్, వెంకటేశులు ఫ్యాక్టరీల ద్వారా వచ్చే పొల్యూషన్‌తో నష్టపోతున్న పంట భూములను పరిశీలించేందుకు వచ్చారు. వీరితోపాటు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున,నేమకల్లు బాధిత రైతులు వెళ్లారు. అధికారులు వచ్చారని స్పాంజ్ ఫ్యాక్టరీల సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. సీపీఐ నాయకులకు ఫ్యాక్టరీ సిబ్బందికి ఒకరికి ఒకరు మీకేం పని అని వాగ్వాదం చేసుకున్నారు. రైతులు జోక్యం చేసుకొని సీపీఐ నాయకులు, రైతుల పక్షాన వచ్చారని బాధిత రైతులు వస్కే రప్ప, రామాంజనేయులు అడ్డు తగిలారు. దీంతో ఫ్యాక్టరీ సిబ్బందికి, రైతులకు ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరు వర్గాల మధ్య తోపులాటతో ఉధృత వాతావరణం నెలకొంది. ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పంట పొలాలు పూర్తి స్థాయిలో పరిశీలించకుండా అధికారులు వెళ్లిపోయారు. ఫ్యాక్టరీ ద్వారా వచ్చే పొల్యూషన్ నుండి పంట పొలాలు దెబ్బ తినడమే కాకుండా ప్రజలు అనా రోగ్యానికి గురవుతున్నారని, ఫ్యాక్టరీ యజమాన్యులకు ఏమాత్రం పట్టడం లేదని సీపీఐ నాయకులు ఆరోపించారు. ఎకరాకు రూ.15 వేల నుండి రూ.30 వేల వరకు ఇవ్వాల్సి ఉన్న తూతూ మంత్రంగా ఎకరాకు రూ. 2వేలు అందించి చేతులు దులుపుకుంటున్నారని సీపీఐ నాయకులు ఆరోపించారు. రైతుల పంట పొలాల్లోకి వచ్చిన పొల్యూషన్ అధికారుల సమక్షంలోని రైతులపై దాడికి యత్నించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు కొట్రేష్, గురుస్వామి, తిప్పేస్వామి, నరసింహులు, రైతులు గోవిందప్ప, ప్రకాష్, అనుమప్ప, సిద్దన్నగౌడ, క్రిష్టయ్య, రామాంజి, మల్లప్ప, వాసికేరిలతో పాటు దాదాపు 40మంది రైతులు పాల్గొన్నారు.

మంత్రి చొరువతో నూతన బోర్లు ఏర్పాటు

విశాలాంధ్ర-ఉరవకొండ: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో విడవనకల్, ఉండబండ గ్రామాల్లో నూతన బోర్లు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉన్న విషయాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి సర్పంచులు నాయకులు తీసుకెళ్లారు. వెంటనే స్పందించి ఆ గ్రామాల్లో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడకూడదని వెంటనే బోర్లు ఏర్పాటు చేసి నీరు సరఫరా చేయాలని సూచించారు. కొత్త బోర్లు, పైపులైన్, మోటార్లను ఏర్పాటు చేసి తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడతామని గురువారం సర్పంచులు తిప్పారెడ్డి, తిమ్మరాజు, చంద్రశేఖర్, జనార్ధన్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి వన్నూరు స్వామి, తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం

విశాలాంధ్ర-యాడికి: డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంలోభాగంగా గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మలేరియా అధికారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని తిప్పారెడ్డిపల్లె పుప్పాల కొట్టాలపల్లి గ్రామాల్లో నిల్వున్న నీటి కుంటలలో మలేరియా డెంగ్యూ దోమల లార్వాలు అభివృద్ధి చెందకుండా గంబు షియా చేపలు నీటిలో వదలడం జరిగింది. మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు, వైద్యులు శ్రీరామ్‌కుమార్, అప్పయ్య, సూపర్వైజర్ రాంప్రసాద్‌గౌడ్,షబ్బీర్, ఆశాకార్య కర్త పద్మావతి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ధర్మవరపు కొండన్నకు ఘన నివాళులు

హాజరైన ఎమ్మెల్యే పరిటాల సునీత.. శ్రీరామ్

విశాలాంధ్ర-రాప్తాడు: ఎమ్మెల్యే పరిటాల సునీత తండ్రి ధర్మవరపు కొండన్న 4వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. రామగిరి మండల పరిధిలోని వెంకటాపురంలో కొండన్న ఘాట్ వద్ద గురువారం పెద్ద ఎత్తున వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిటాల సునీతతో పాటు ధర్మవరం టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీ రామ్, రాప్తాడు, ఆత్మకూరు మండలాల టీడీపీ ఇన్‌చార్జ్‌లు ధర్మవరపు మురళీ, బాలాజీ,పరిటాల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. అభిమానులు, శ్రేయోభిలాషులు, పార్టీ కార్యకర్తలుపెద్దఎత్తున పాల్గొన్నారు. ముందుగా కొండన్న ఘాట్ వద్ద కుటుంబ సభ్యులుఘనంగా నివాళులర్పించారు.

అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ తన జీవితాన్ని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దడంలో తండ్రి పాత్ర ఎంతో ఉందన్నారు. నా విజయంలో, బాధల్లోనూ వెన్నంటే ఉన్నారన్నారు. ఆయన మరణం మాకు ఎప్పటికీ లోటేనన్నారు.

నీటి కుంటలలో గంబుజియా చేపలు విడుదల

విశాలాంధ్ర-తాడిపత్రి: పెద్దపప్పూరు మండలం పెద్దయక్కలూరు, జూటూరు గ్రామాల్లోని నీటి కుంటలలో గురువారం డా. ఉషారాణి గంబుజియా చేపలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లాంటి విష జ్వరాల నివారణ కోసం డెంగ్యూ, మలేరియా దోమలు పెరగకుండా నివారించడానికి గంబుజియా చేపలను విడుదల చేశామన్నారు. ఈ చేపలు దోమ లార్వాలను తినడం ద్వారా దోమలు వృద్ధి కాకుండా నివారించవచ్చు. అంతేకాకుండా మండల, గ్రామాలలోని ప్రజలు తమ ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఇంటి చుట్టు ఏవైనా నీటి గుంతలు ఉంటే వాటిని పూడ్చి వేసుకోవాలన్నారు. రాత్రి సమయాలలో దోమతెరలు కట్టుకొని నిద్రించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు శర్మాష్ వలి మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ గంగాదేవి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి ట్యాంకును పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర-తాడిపత్రి: మండలంలోని కోమలి గ్రామంలోని తాగునీటి ట్యాంకును గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐజయ్య పంచాయతీ కార్యదర్శి ప్రతాప్ రాజు పరిశీలించినట్లు తెలుగుదేశం పార్టీ నాయకుడు సుంకర నాగేంద్ర చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం వచ్చినప్పటి నుండి తమ గ్రామంలో నీటి ట్యాంకుకు నీరు నిల్వ ఉంచకపోగా పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో దాదాపు ఐదు సంవత్సరాల నుండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెలుగు దేశం ప్రభుత్వం వచ్చిన వెంటనే కోమలి గ్రామంలో నీటి సమస్య ఉందని నీటి ట్యాంకు మరమ్మతులు చేయించి, నీటి కొరత తీర్చాలని పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసాము. అలాగే నీటి ట్యాంకు మరమ్మత్తులకు తాము ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తామని అధికారులకు భరోసా కల్పించాము. దీంతో అధికారులు స్పందించి గురువారం గ్రామానికి వచ్చి నీటి ట్యాంకులు పరిశీలించి దీనిని వెంటనే మరమ్మతు చేయించి నీటి ట్యాంకులో నీరు నిల్వ ఉండేటట్లు ఏర్పాటు చేసి ప్రజలకు ట్యాంకు సద్వినియోగంలోకి వచ్చే విధంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోమలి గ్రామ పాఠశాల చైర్మన్ సుంకర పెద్దిరాజు, గ్రామ పెద్దలు హనుమంత రెడ్డి, కులశేఖర్ రెడ్డి, సచివాలయం సెక్రటరీ శ్రీరామ్ ఉప సర్పంచ్ ప్రవీణ శ్రీనివాసులు, నాగరాజు, రామాంజనేయులు ఫీల్డ్ అసిస్టెంట్ సంఘవి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ విధిగా ఇంటి పరిసర ప్రాంతాల్లో విరివిగా మెక్కలు నాటండి

విశాలాంధ్ర-అనంతపురం: ప్రతిఒక్కరూ విధిగా వారి ఇంటి పరిసర ప్రాంతాల్లో మెక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర పాలక ఉన్నత పాఠశాల ఆవరణంలో ప్రమీలమ్మ, వారి కుమారుడు అనిల్ వారిచే నిర్వహిస్తున్నఏజీఎస్ ఫౌండేషన్ వారిచే నోట్ పుస్తకాలు, పెన్ను, పెన్సిల్స్, క్రికెట్ కిట్లు, షటిల్ బ్యాట్స్, పిచ్చుక గూళ్ళు, తదితర వస్తువులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత కొంతకాలంగా ప్రభుత్వం తరఫున అధికారులు వచ్చి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. డిస్కవరీ అనంత పేరుతో చేస్తున్న సేవలు, చేపట్టే కార్యక్రమాలు ప్రభుత్వం తరఫున వారికి సహాయ, సహకారం అందజేయడం ఉంటుందన్నారు. అలాంటి మంచి హృదయం కలిగిన వారికి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం సమాజంలో ప్రతిఒక పని ప్రభుత్వమే చేపట్టాలని ఎదురు చూడడమే కాదు..ఇలాంటి మంచి ఆలోచనలు ప్రజలలోనే రావాలని, దానిని ప్రతిరోజు పాటించాలన్నారు. అంతే కాకుండా మనఇంటి చెత్తని ఎక్కడ వేయాలి పరిశుభ్రతను పాటించే విధంగా చూడాలి, కొన్ని సందర్భాలలో నేను అనంతపూర్ టౌన్‌లో వెళ్లడం జరుగుతుంటుంది.. కొంతమంది వాహన చోదకులు అనవసరంగా హారన్ వేయడం దానివల్ల చాలామందికి ఇబ్బంది అవుతుందని, బావి భారత పౌరులు వీటిపై అవగాహనతో క్రమశిక్షణతో పాటించి కుటుంబంలో వారికి తెలియజేసి మంచి సమాజాన్ని అందించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, హార్టికల్చర్ అధికారులకి నగరంలో శానిటేషన్, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని, తద్వారా ఉదయం, సాయంత్రం సమయంలో పాదచారులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించిన వారు అవుతామని తెలియజేశారు. అలాగే పట్టణ శివార్లలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేదారిలో చెట్లు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అలాగే డిస్కవర్ అనంతపూర్ లో భాగమైన గ్రీన్ ఆర్మీ వారి సారథ్యంలో మొక్కలు నాటే కార్యక్రమం పాల్గొని, అనంతపురంలోని ప్రజలకు ప్రతి ఒక్కరూ మీ ఇంటి ముందు పరిసర ప్రాంతాలలో చెట్లు నాటాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్ ప్రసన్న లక్ష్మి, ఏజీఎస్ ఫౌండేషన్ వారు ప్రమీలమ్మ, వారి కుమారుడు అనిల్, ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రకాష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డులతో కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: సీసీఆర్సీ కార్డులతో కౌలు రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కౌలు రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉరవకొండ డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏ పద్మజ పేర్కొన్నారు. గురువారం విడవనకల్ మండల పరిధిలోని చీకల గురికి,ఉండబండ గ్రామాల్లో కౌలు రైతులకు మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలుదారు హక్కు పత్రాలు పొందే విధి విధానాలపై సూచనలు సలహాలు ఇచ్చారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ వర్గాలకు చెందిన భూమిలేని రైతులు,ఇతర రైతుల వద్ద నుంచి భూమి కౌలుకు తీసుకున్న రైతులందరూ అర్హులన్నారు. అదేవిధంగా దేవాలయ భూములను కౌలుకు చేస్తూ గుత్త చెల్లించే వారు కూడా అర్హులని తెలిపారు. సి సి ఆర్ సి కార్డులు పొందడానికి దేవాలయ భూములు సాగు చేసే గుత్త రసీదులు, కౌలు రైతులు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్‌లను జత చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా కౌలుకు తీసుకున్న రైతులు భూయజమాని పాస్ బుక్,ఆధార్ కార్డు,10 రూపాయలు విలువ గల రెవిన్యూ స్టాంప్ పై 11 నెలలు పాటు రాసుకున్న ఒప్పంద పత్రంతో పాటు కౌలు రైతు ఆధార్ కార్డు,బ్యాంక్ అకౌంట్ బుక్ జిరాక్స్ పత్రాలను జత చేసి గ్రామ వీఆర్వోలకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య, పంచాయతీ సెక్రెటరీ మునాఫ్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది లక్ష్మన్న,ఎంపీ ఈవో లక్ష్మన్న కౌలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట సాగుదారు హక్కుపత్రంపై..

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రం యాడికితో పాటు వీరారెడ్డి పల్లిలో కౌలు రైతులకు పంటసాగుదారు హక్కు పత్రంపై అవగాహన కార్య క్రమం గురువారం మండల వ్యవసాయ అధికారి మహబూబ్ భాష నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మహబూబ్ బాష మాట్లాడుతూ కౌలురైతులు కౌలుపత్రాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈపత్రం ద్వారా కౌలు రైతులకు బ్యాంక్‌లో రుణాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట దెబ్బ తింటే ప్రభుత్వం ద్వారా పంట నష్ట పరిహారం పొందవచ్చన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే పథకాలన్నీ వర్తిస్తాయని తెలిపారు. ఈ సీసీఆర్సి కార్డు కొరకు రైతుసేవ కేంద్రం సిబ్బందిని గాని గ్రామ రెవెన్యూ అధికారులను గాని సంప్రదించాలన్నారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాష, గ్రామ వ్యవసాయ అధికారి,గ్రామ రెవెన్యూ అధికారి రైతులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లిలో జలదికి వెళ్ళిన పీర్లు

విశాలాంధ్ర-కూడేరు: మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో తొమ్మిది రోజులుగా మొహరం పీర్ల పండుగను అంగరంగ వైభవంగా గ్రామప్రజలు జరుపుకున్నారు. బుధవారం పానకాలు, భక్తులు తరలి వెళ్లి పీర్లు స్వాములైన వన్నూరుస్వామి, కుళ్లాయి స్వామి, కోరుమామిడి దేవుడు, పలుస్వాములను గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో డప్పుల వాయిద్యాలతో ఊరేగింపు చేసి భక్తులు స్వాముల వారికి తమ మొ క్కులు సమర్పించారు. వన్నూరు స్వామి దేవనకు ఒక భక్తుడు బత్తల వెంకట రాముదు అనేరైతు వన్నూరు స్వామికి అర్థ కేజీ వెండి గొడుగు దాదాపు రూ.5,60,000 దాకా తయారు చేయించిన వెండి గొడుగును పీర్ల స్వామికి సమర్పించుకున్నారు. గురువారం సాయంత్రం అగ్నిగుండంలోకి ప్రవేశించి జలదికి తరలించారు.

మొహరం పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శివరాముడు తమ సిబ్బందితో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కుల మతాలకతీతంగా గ్రామ ప్రజలు కలిసికట్టుగా మొహరం పండుగను ఘనంగా జరుపుకున్నారు.

సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు నిధులు మంజూరు చేయాలి

సీఎంను కోరిన మంత్రి పయ్యావుల కేశవ్

విశాలాంధ్ర-ఉరవకొండ: అనంతపురం జిల్లా గుత్తి మండలం సేవాఘడ్ లో వెలసిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు రూ.50 లక్షలు మంజూరు చేయాలని, ఈ మేరకు సాధారణ బడ్జెట్‌లో నిధులను కేటాయింపులు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గారు కోరారు. శ్రీ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అనంతపురం జిల్లాలోని గుత్తి మండలం సేవాఘడ్ లో జన్మించారని, ప్రతి ఏడాది ఫిబ్రవరి 13 నుండి 15 వరకు దేశవ్యాప్తంగా ఆయన జయంతిని జరుపుకుంటున్నారన్నారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మరియు లక్షలాది మంది భక్తులు ఆయన జన్మదిన వేడుకలకు హాజరై సేవాగడ్ లో మాతా జగదాంబ మరియు సేవాలాల్ మహారాజ్ కి ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేస్తారన్నారు. 2019 - 2024 మధ్యకాలంలో రాష్ట్రంలో ఇంతకుముందు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎటువంటి నిధులను మంజూరు చేయలేదన్నారు. ఉత్సవాల సమయంలో రవాణా, ఆహారం, వసతి మరియు ఇతర సౌకర్యాల కోసం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఛారిటబుల్ ట్రస్ట్ వివిధ రుణాలు తీసుకున్నారన్నారు. 2014 - 2019 మధ్యలో తమ ప్రభుత్వం వేడుకలు నిర్వహించడానికి ప్రతి సంవత్సరం 25 లక్షల రూపాయలను మంజూరు చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025 ఫిబ్రవరి 13 నుండి 15 వరకు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను నిర్వహించడం కోసం 50 లక్షల రూపాయలను మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆర్థిక మంత్రి కోరారు. ఇందుకు సంబంధించి సాధారణ బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు చేయాలని ముఖ్యమంత్రిని మంత్రి అభ్యర్థించారు. వచ్చే ఫిబ్రవరి 2025లో జరిగే సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల కోసం నిధుల మంజూరు మరియు తర్వాత ఇక్కడ బడ్జెట్ అంచనాలలో కేటాయింపులు చేయడం కోసం సంబంధిత అధికారులు పరిశీలించి, ఆదేశించవలసిందిగా ముఖ్యమంత్రిని ఆర్థిక మంత్రి కోరారు.

కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం..జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-అనంతపురం: అనంతపురం జిల్లాను కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్లో గురువారం జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం కలెక్టరేట్ లోని మినీ మీటింగ్ హాల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కుష్టు వ్యాధిపై ఉన్న అపోహల గురించి ప్రజలకు అవగాహన కల్పించి కుష్ఠు వ్యాధి సోకిన ప్రతి వ్యక్తిని గుర్తించి చికిత్సలు అందించాలని వైద్య అధికారులను సిబ్బందిని ఆదేశించారు. కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం చేపట్టాలన్నారు. జిల్లాలో దాగిఉన్న కుష్టి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో ఈ నెల 18 నుండి ఆగస్టు రెండు వరకు 15 రోజులు పాటు వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రతి ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. సర్వేలు కుష్టివ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి వైద్య సౌకర్యాలు అందించాలన్నారు. కుష్టువ్యాధి లక్షణాలు ప్రాథమిక ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య సేవలు అందిస్తే ఆరు మాసాల్లో పూర్తిగా నయమవుతుందన్నారు. జిల్లాలోని ప్రతి వ్యక్తి ని కుష్ఠు వ్యాధి పరీక్షలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పిల్లలకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. అలాగే సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో కుష్టువ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించే కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ఈబి.దేవి, జిల్లా లెప్రసి ఎయిడ్స్ మరియు టీబీ. జిల్లా అధికారి డా.అనుపమ జేమ్స్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి డా.శ్రీదేవి, డీపీవో ప్రభాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 26, జూలై 2024

సీపీఐ నాయకులు వినతికి స్పందన..స్పందించిన జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర-తలుపుల: మండల కేంద్రంలో మరుగుదొడ్లు లేక తీవ్రఇబ్బంది ఎదుర్కొంటున్న మండల ప్రజానికం దృష్టిలో ఉంచుకొని రెండు రోజుల క్రితం తహశీల్దార్ కార్యాలయానికి ఆకస్మిక తనిఖీ కోసం వచ్చిన జాయింట్ కలెక్టర్ అభిషేకుమార్‌కు స్థానిక సీపీఐ నాయకులు జగిలి ఈశ్వరయ్య, రాముడు మరుగుదొడ్లు లేక ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని జాయింట్ కలెక్టర్ ఎదుట వారు వాపోయారు. నిరుపయోగంలో ఉన్న వాటిని వినియోగంలోకి తీసుకురావాలని జెసీకి వినతిపత్రం అందజేయగా ఆయన వెంటనే స్పందిస్తూ తక్షణమే మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకురావాలని మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించిన అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో శరవేగంగా నిరుపయోగంలో ఉన్న మరుగుదొడ్లను చెత్తచెదారని తొలగిస్తూ పంచాయతీ సిబ్బంది పనులు చేపట్టారు. వారం రోజుల్లో మరుగుదొడ్లు వినియోగంలోకి వస్తాయని సంబంధించిన అధికారులు తెలిపారు. స్థానిక ప్రజలు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా స్థానిక మండల కార్యదర్శి జగిలి ఈశ్వరయ్య, సీపీఐ నాయకులకు, టీడీపీ ఎద్దుల రాముడు అభినందనలు తెలిపారు.

రికార్డులను పటిష్టంగా భద్రపరచండి..అధికారులను ఆదేశించిన జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర-ధర్మవరం: రెవెన్యూ పరిధిలోని ప్రతిరికార్డును పటిష్టంగా భద్రపరచాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గంలోని బత్తలపల్లి, తాడిమర్రి, ధర్మవరం మండలాల్లోని రెవెన్యూ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో భాగంగా ధర్మవరం ఆర్డీవో కార్యాలయంలోని రికార్డుల గదిని కూడా వారు తనిఖీ చేస్తూ అప్రమత్తంగా ఉంటూ, భద్రత తప్పనిసరిగా ఉండాలని ఆర్డిఓ వెంకట శివరామిరెడ్డికి సూచించారు. అనంతరం ఆర్డిఓ సిబ్బందితో విధులు పట్ల ఉండాల్సిన అంశంపై వారు చర్చించారు.తహశీల్దార్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెవిన్యూ విభాగంలో ఉన్నటువంటి వివిధ క్యాడర్లతో వారిని విధులు పట్ల ఏ విధంగా ఉండాలి? విధులు వాటి బాధ్యతల గురించి వివరించారు. ఎక్కడ కూడా నిర్లక్ష్యం, అశ్రద్ధ, మొండితనం ఉండరాదని అలా ఉంటే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. పరిపాలన విధానంపై తగు సూచనలు, సలహాలను కూడా ఇవ్వడం జరిగింది. ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని, ఇది ప్రతి ఉద్యోగి బాధ్యతగా వ్యవహరించినప్పుడే ప్రజలలో మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. రికార్డుల నిర్వహణ, వాటి భద్రత విషయంలో పూర్తి రెవెన్యూ అధికారులదే బాధ్యత ఉంటుందని, ప్రతిరోజు వీఆర్ఏని అక్కడ నియమించాలని, రికార్డులను తీసుకొనుట, మళ్లీ పెట్టుట లాంటి విషయంపై ఒక రికార్డును మెయింటైన్ చేయాలని ఆదేశించడం జరిగిందని తెలిపారు. కార్యాలయం చుట్టూ ప్రజలు తిరగరాదని, షెడ్యూల్ తేదీల ప్రకారం ప్రజల సమస్యలు పరిష్కరించేలా తహశీల్దార్లు, సిబ్బంది తప్పనిసరిగా విధులు నిర్వర్తించాలని సూచించారు. తదుపరి ఎమ్మార్వో సిబ్బంది కొరత గూర్చి జేసికి తెలియజేయగా, త్వరలోనే కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

కోర్టు కేసులు, వ్యవసాయ విషయాలపై, సర్వే విషయాలపై, భూ తగాదాల విషయాలపై ప్రత్యేక దృష్టిని సారించాలని, విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. తదుపరి రెవెన్యూ సిబ్బంది అధికారుల యొక్క సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకట శివరామిరెడ్డి, స్థానిక ఎమ్మార్వో రమేష్, డిప్యూటీ ఎమ్మార్వో లక్ష్మీదేవి, తాహసిల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని గొర్రెలు మేకలు మృతి..

ఆదుకోవాలని బాధితుడు ఆవేదన

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఈనెల 24వ తేదీ రైలు కింద అనుకోకుండా 37 గొర్రెలు మేకలు మరణించాయి. బాధితుడు నారాయణప్ప మాట్లాడుతూ తాను గొర్రెలు మేకలు పోషించుకుంటూ తన కుటుంబాన్ని పోషించేవాడిని తెలిపారు. నేత కోసం కోరుకుంటూ ఇందిరమ్మ కాలనీ వైపు వెళ్లాలని అనుకోకుండా రైలు పట్టాలు దాటుతుండగా ఓ రైలు వచ్చి ఢీకొనడంతో ఈ సంఘటన జరిగిందని బాధను వ్యక్తం చేశారు.

తనకు దాదాపు రూ.5 లక్షల వరకు నష్టపోయారని తనను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు వాపోయారు. సమాచారం అందుకున్న మంత్రి సత్య కుమార్ యాదవ్ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించి కలెక్టర్ రెవెన్యూ అధికారులతో మాట్లాడి తగిన పరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ

విశాలాంధ్ర-కదిరి: కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ వి.రత్న తనిఖీ చేశారు. గురువారం సాయంత్రం టౌన్ స్టేషన్‌లోని రిసెప్షన్, సీఐ,ఎస్సై, కంప్యూటర్ గదులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో గంజాయి, పాతో కేసులు,యువత బైక్ రైడింగ్ వంటివి ఎస్పీ దృష్టికి తీసుక రాగా ఇలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.జిల్లాలోని పుట్టపర్తి, ధర్మవరం, పెనుగొండ, కదిరి ప్రాంతాలను తనిఖీ చేసి వివరాలు సేకరించి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రకృతి వ్యవసాయం సాగుతో రైతులకు లాభదాయకం-ఏవో శేఖర్‌నాయక్

విశాలాంధ్ర-అగళి: రైతులు ఖర్చులు తక్కువతో ప్రకృతి వ్యవసాయం సాగుచేస్తే అధిక దిగుబడితో పాటు లాభలు పొందవచ్చని ఏవో శేఖర్‌నాయక్ తెలిపారు. మండలం లోని మధూడి, ఇనగలూరు, తోనసనపల్లి, దొక్కలపల్లి, గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను, మండల వ్యవసాయధికారి, ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సిబ్బంది వ్యవసాయ క్షేత్రాలు సందర్శించి, చీడ పీడలను పరిశీలించి, పలుపంటలపైన, ఆకుముడత పురుగు ఆశించినట్లుగా గుర్తించారు. పురుగు ప్రారంభ దశలోనే గుడ్లు పెట్టిన స్థాయిలో సేంద్రియ సాగు పద్దతిలో భాగంగా, నీమాస్త్రం అనే కాషయాన్ని, వేపాకులు, 10 కేజీలు, గోమూత్రం 10 లీటర్లు, గోవు పేడ 2 కేజీలు వీటన్నిటిని కసాయ ద్రావణముగా తయారు చేసి 200 లీటర్లనీళ్లలో కలిపి 48గంటల పాటు మరగపెట్టి ద్రావణం పులిసిన తర్వాత కాసాయాన్ని పల్చటి గుడ్డతో వడపోసి పంటల పై పిచికారి చేసినట్లైతే చీడ పీడలను సమూలంగా నివారించవచ్చన్నారు. రైతులు ఎక్కువ పెట్టుబడితో రసాయనిక మందులను ఉపయోగించి నష్టపోకుండా సేంద్రియ పద్దతుల ద్వారా తక్కువ ఖర్చుతో పంటల యాజమాన్యం చేసి లాభసాటి సేంద్రియ వ్యవసాయము చేయడం వల్ల మానవాళికి ఎటువంటి హాని కలుగకుండా, పర్యావరణాన్ని రక్షించుకుంటూ ప్రకృతి సమతుల్యత ను కాపాడుతూ తక్కువ ఖర్చుతో లాభ సాటి వ్యవసాయము చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ఈకార్యక్రమంలో సేంద్రియ సిబ్బంది, రవీంద్ర కుమార్, లక్ష్మికాంత్, కేంపరాజు, మాలేగౌడ, ఉమాదేవి, దుగ్గెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: రైతులు సాగు చేసే పంటలకు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని ఏడిఏలు విద్యావతి, సనావుల తెలిపారు. మండల పరిధిలోని బైరాపురంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు చినారప్ప పొలంలో వేరుశనగ పంటను పరిశీలించి ఈ పొలంబడి కార్యక్రమాన్ని పంట పెట్టిన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేరుశనగ పొలము చుట్టూ కంచ పంటగా నాలుగు రకాల పంటను వేసు కోవాలన్నారు. మొక్కజొన్న, జొన్న, సజ్జ, వేయడం ద్వారా రసం పీల్చే పురుగులను అరికట్టవచ్చన్నారు. రసం పీల్చే పురుగులు నివారణకు బంతిపువ్వులు, పొద్దుతిరుగుడు, పూల మొక్కలను పెంచాలన్నారు. వీటిని పెంచడం ద్వారా పొలాల్లో పురుగులని అరికట్టవచ్చు అన్నారు. కీటకాలను అరికట్టదానికి ఎకరానికి ఒక లీటర్ వేప నూనె రెండు లీటర్ల నీటితో పిచికారి చేయాలన్నారు. పంట పూత దశలో ఉన్నప్పుడు ఎకరాకు 200 కేజీల వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు నటరాజు, అబ్దుల్లా అలీ, శశిధర్ రెడ్డి ,మరియు విఏఏలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి

విశాలాంధ్ర-గోరంట్ల: మండల పరిధిలోని రాగిమాకులపల్లి గ్రామ సమీపాన బెంగళూరు బైపాస్ రోడ్డు మీద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సుమారు ఏడాది వయసు గల మగ జింక గాయపడి రోడ్డుమీద పడి ఉన్నదన్న సమాచారం తెలుసుకున్న రాగి మాకులపల్లి ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు మహేష్, సురేష్‌లు సదరు జింకను పాఠశాల ఆవరణమునకు తరలించి సమాచారాన్ని అటవీ సిబ్బందికి సమాచారం అందించారన్నారు. సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని కృష్ణ జింకను పరిశీలించగా పొట్ట మీద తీవ్రగాయాలతో జింక మరణించినట్లు తెలుసుకున్న అటవీ సిబ్బంది పోస్టుమార్టం నిమిత్తం గోరంట్ల పశువైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం జింకను దహనం చేసినట్లు తెలిపారు.

శ్రీనివాస డిగ్రీ కళాశాలలో ఏఐసీటీఈకు అనుమతి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని సాయి నగర్‌లోని శ్రీ శ్రీనివాస డిగ్రీ కళాశాల అండ్ పీజీ కళాశాలలో బిబిఏ, బిసిఏ కోర్సులతో పాటు 224-25కి ఏఐసిటిఈ అనుమతి పొందిన ఏకైక పాఠశాల మా కళాశాల అని ప్రిన్సిపాల్ ముసలిరెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు డిగ్రీ చేరుటకు రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు, మాకళాశాలలో ఆప్షన్స్ పెట్టుకోవాలని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు తెలియజేశారు. మరిన్ని వివరాలకు 90142 19361 లేదా 99492 06228 లేదా 70131 45328 కు సంప్రదించాలని తెలిపారు.

నెలల పసికందు అకస్మాత్తుగా మృతి



విశాలాంధ్ర-ధర్మవరం:నియోజకవర్గంలోని బత్తలపల్లి మండలం అనంత సాగర్‌కు చెందిన రోహిణి కుమార్ సువర్ణల మూడో సంతానమైన మోక్షజ్ఞ అకస్మాత్తుగా మృతి చెందడం జరిగింది. కుటుంబీకులు తెలిపిన ప్రకారం వివరాలకు వెళితే రోహిణి కుమార్ సువర్ణలకు మూడవ సంతానముగా మోక్షజ్ఞ జన్మించడం జరిగింది. జన్మించిన తొలిత ఫీట్స్ రావడం జరిగిందని, అనంతరం బాబు పెరిగినప్పటి నుంచి రాలేదని, అనుకోకుండా రెండు రోజుల కిందట వాంతులు కావడంతో అనుకూలమైన చోట చూపించడం జరిగిందని, తదుపరి తగ్గకపోవడంతో బెంగళూరులో ప్రైవేట్ హాస్పిటల్‌కు చూపించాలన్న ఉద్దేశంతో గుంతకల్లులోని వారి బంధువుల ఇంటి నుండి వారు కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో బాబు ఉలుకు పలుకు లేకపోవడంతో హుటాహుటిన ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ఇప్పటికే మృతి చెందిన బాబుకు బెంగళూరులోని హాస్టల్ సిఎంపి హాస్పిటల్‌లో రూ.10లక్షలు, బెంగళూరు ఉదయ హాస్పిటల్‌లో రూ.లక్ష ఖర్చు చేసిన బాబు బతకలేదని తాత ఆవేదన వ్యక్తం చేశాడు. తండ్రి బెంగళూరులో ఓ ప్రైవేటు ఉద్యోగిగా, తల్లి గృహిణిగా ఉండేదని తెలిపారు. రెండో సంతానం కూడా ఏడాది కిందట రెండు నెలల బాబు అకస్మాత్తుగా మృతి చెందడం జరిగిందని తెలిపారు. మేనరికం వివాహం జరిగిందని తెలిపారు. మొత్తం మీద ఈకుటుంబంలో తల్లిదండ్రులు ఇద్దరు కుమారులను మృత్యువాత పడటం అందరినీ కలిచివేసింది. ఈ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని కుటుంబ సభ్యులు స్థానికులు కోరుతున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో తక్షణ ప్రవేశాలు

విశాలాంధ్ర-ధర్మవరం:పట్టణంలోని గుట్ట కింద పల్లిలోగల పాలిటెక్నిక్ కళాశాలలో తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ సురేష్ బాబు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి ఉత్తీర్ణత చెందినవారు పాలిసెట్ లో అర్హత పొందనప్పటికీ స్పాట్ అడ్మిషన్లకు అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 29వ తేదీ లోపు తమ దరఖాస్తుతో పాటు సంబంధిత సర్టిఫికెట్ యొక్క జిరాక్సును జత చేసి కళాశాలలో సమర్పించాలని తెలిపారు. కావలసిన సర్టిఫికెట్లలో పాలిసెట్ 2024 హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, పదవ తరగతి మార్కుల కార్డు, పదవ తరగతి టిసి, నాలుగవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఆయా హైస్కూల్ హెడ్మాస్టర్ జారీచేసిన స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం, ఫీజు వివరములు లలో ప్రాసెసింగ్ ఫీజు ఓసి, బిసి విద్యార్థులకు 700 రూపాయలు(పాలీసెట్ 2024 ప్రవేశ పరీక్షలో అర్హత పొందిన వారికి మాత్రమే) ఉంటుందని, అదేవిధంగా 1100 రూపాయలు (పాలీసెట్ 2024 అర్హత సాధించని వారికి) సీటు పొందిన వారు 4700 రూపాయలు కళాశాలలోనే చెల్లించాలని తెలిపారు. స్పాట్ అడ్మిషన్‌కు వచ్చే విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్లు జిరాక్స్ తప్పకుండా తీసుకొని రావాలని తెలిపారు. మా కళాశాలలో డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్, డిప్లమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ కలదని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు సీటు పొందిన వారికి ఎలాంటి స్కాలర్షిప్ వర్తించవని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు గమనించి తమ పిల్లలను కళాశాలలో అడ్మిషన్లు చేర్పించాలని తెలిపారు.

నారాయణ సేవలో అన్నదానం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి అనారోగ్యంతో వైద్య చికిత్సల కొరకు వచ్చిన వారికి, మరియు హాస్పిటల్ నందు అడ్మిట్ అయిన వారికి హాస్పి టల్ నందు వైద్య సేవలు అందిస్తున్న ఆరోగ్య కార్యకర్తలకు నారాయణ సేవలో భాగంగా 150 మందికి అన్నదానం, అరటి పండ్లు అందజేసినారు. హాస్పిటల్‌లో పనిచేయుచున్న జ్యోతి, రామాంజనేయులు, దంపతులు,వీరి కుమార్తె చిరంజీవి ప్రేమిక జన్మదిన సందర్భంగా సహకరించారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు,హాస్పిటల్లో పని చేయుచున్న వారందరూ పాల్గొని సేవనందించినారు. చిరంజీవి ప్రేమకకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయుచు. ఈ కార్యక్రమంలో సహక రించి సేవలందించిన వారందరికీ భగవాన్ బాబా వారి యొక్క అనుగ్రహ ఆశీస్సులు ఉంటాయని సేవా సమితి అధ్యక్షులు శంకర్ తెలిపారు.

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు-జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర-చిలమత్తూర్ రూరల్: మండల కేంద్రంలోని స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని గురువారం సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. రెవిన్యూ సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలే అన్నారు. ఈ నేపథ్యంలో కార్యాలయంలోని రికార్డు గదిని పరిశీలిస్తూ తప్పనిసరిగా సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఫైర్ స్టాపర్లు పెట్టాలని సూచించారు. ఇటీవల మదనపల్లి రెవిన్యూ కార్యాలయంలో రికార్డ్ గదిలో అగ్ని ప్రమాదం సంభవించి ఫైళ్ళ దగ్గరమైన విషయం అందరికీ తెలిసిన విషయమే ఇందులో భాగంగా సత్యసాయి జిల్లా రెవిన్యూ కార్యాలయాల్లోని రికార్డుల గదుల్లో జాగ్రత్తలు పాటించాలని సబ్ కలెక్టర్ తెలిపారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేస్తూ విధి నిర్వహణలో, నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.క్షేత్రస్థాయిలో అధికారులపై ఫిర్యాదులు రాకూడదని హెచ్చరించారు.కార్యాలయంలో పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. అక్కడికి వచ్చిన రైతులతో సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలపై వెంటనే స్పందించి న్యాయం చేయాలని సిబ్బందికి తెలిపారు.

ఆక్రమణలు తొలగింపు

విశాలాంధ్ర-కొత్తచెరువు: పెనుగొండ రోడ్డు నుండి బీసీ కాలనీకి వెళ్లే రహదారి ఆక్రమణకు గురి కావడంతో పంచాయతీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి సిబ్బంది వాటిని తొలగించడానికి శ్రీకారం చుట్టారు. ఈ రహదారి గతంలో ప్రభుత్వం 30 అడుగుల రహదారిని కేటాయించగా రహదారికి ఇరుపక్కల వారు ఆక్రమించుకోవడంతో వాహనాలు రాకపోవుటకు తీవ్రఅంతరాయం ఏర్పడుతోంది. వీటి విస్తరణకు కాలనీ ప్రజలు అడ్డుకొని పంచాయతీ వారిపై వాదనకు దిగారు. దీనితో రహదారిని వెడల్పుచేసి డ్రైనేజీ పంచాయతీ నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. విస్తరణ పనులు కేశవ ఇంటి నుండి వాటర్ ట్యాంక్ వరకు ఆక్రమణలను జెసిపి ద్వారా పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో ఉచితంగా ఆధార్ నమోదు

విశాలాంధ్ర-అగళి: మండల పరిధిలోని రామాపురంతో పాటు మండల కేంద్రంలో ని అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ఉచితంగా ఆధార నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు మీ సేవ నిర్వాహకుడు సిద్దు తెలిపారు. సీఎస్‌సీ మీసేవ ద్వారా ఆధార్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించామని, అంగన్వాడి కేంద్రం లోని పిల్లలందరికీ ఆధార్ నమోదు చేస్తామని, ఈనెల 27వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, కావున ఆధార్ నమోదు చేసుకొని వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైల్వే ఇనుప దూలం కేసులో ఇద్దరు అరెస్టు

విశాలాంధ్ర-ధర్మవరం: జూన్ 18న ధర్మవరం-నాగసముద్రం మధ్య ధర్మవరం టౌన్ కొత్తపేట గాంధీనగర్ అండర్ బ్రిడ్జి దగ్గర రైల్వే ట్రాక్ మీద ఇనుప దూలం పెట్టిన సంఘటనలో కేసు రిజిస్ట్రేషన్ చేసి దర్యాప్తు చేయడం జరిగిందని ఇందులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందని ధర్మవరం రైల్వే ఆర్పిఎఫ్ నాగరాజు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అనుమానాస్పదంగా రైల్వే ప్రాంతంలో ట్రాక్ పరిసరాలలో ఉన్నటువంటి గాడే ఓబులేసు..పెద్దపప్పూరు.కె.శివకుమార్ గీతానగర్ ధర్మవరం వారిని పట్టుకుని విచారించగా, వారు విరివేగ రైల్వే ప్రాంతానికి వచ్చి మద్యం సేవిస్తూ ఉంటారని ఆసేవించే క్రమంలో రైలు అటువైపు వెళుతున్నటువంటి ట్రైన్లకు రాళ్లు వేయడం ట్రాక్ మీద ఐరన్ ముక్కలు గాని రాళ్లు గాని పెట్టడం జరుగుతుందన్న విచారణలో తేలిందన్నారు. ఈనేరం తామే చేసినట్లు ఆ ఇరువురు ఒప్పుకున్నారని తెలిపారు. ఇంటిదగ్గర నుంచి ఐరన్ ఇనుప దూలాన్ని తీసుకొచ్చి వాటిని ట్రాక్ మీద పెట్టి అదినలిగిన తర్వాత తీసుకొని వెళ్లి దగ్గర్లో ఉన్న స్క్రీన్‌షాపులో విక్రయించాలన్న ఉద్దేశంతో చేసినట్లు వారు తెలిపారని తెలిపారు.పూర్తి విచారణ చేసిన తర్వాత ఆసంఘటనలో ఎటువంటి కుట్ర పూరితమైన ఉద్దేశ్యం లేదని నిర్ధారించడం జరిగిందని తెలిపారు. తాగుడుకు బానిస అయిన ఇద్దరు యువకులు బాధ్యత రాహిత్యంతో దగ్గరలో ఉన్నటువంటి పాడుబడ్డ ఇంటి దగ్గరలోని పాతు ఇనుప దూలాన్ని అమ్మాలని ఉద్దేశంతో తీసుకున్న వెళుతున్న సమయంలో రైలు సమీపిస్తుందన్న వాటిని గమనించి ఆ ఇనుప దూరాన్ని వదిలేసి వెళ్లడం జరిగిందని తెలిపారు. తదుపరి ఆ ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి పూచి కత్తుతో బెయిల్ మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. కానీ అనుకోకుండా ప్రమాదం జరిగి ఉంటే రైలులో వందలాది మంది ప్రయాణికులకు ఎంతో ముప్పు వాటిలేదని తెలిపారు. మొత్తం మీద కేసును త్వరితగతిన ఛేదించినందుకు జిల్లా అధికారులు అభినందించారు. తదుపరి ధర్మవరం పట్టణ ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్పిఎఫ్ రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

వేరుసెనగలో ఆకు ముడతపై అవగాహన

విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్: మండల పరిధిలోని చాగలేరు పంచాయతీలోగల శానగానపల్లిలో గురువారం వ్యవసాయ అధికారిమనోహర్ వేరుశనగ పంటలో ఆకు ముడతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడిఏ అల్తాఫ్ అలీఖాన్, ఏవో వంశీకృష్ణ ఆదేశాలు మేరకు ఖరీఫ్ లో సాగుచేసిన వేరుశనగ పంటను ఆశించే ఆకు ముడత పురుగ నివారణకై తీసుకోవలసిన జాగ్రత్తలపై శానగానపల్లి రైతు శివప్ప, అంజనమ్మ పొలం నందు వేరుశనగ పంటను పరిశీలించి వాటికి ఆశించిన ఆకు ముడత నివారణలో భాగముగా పంటకి క్లోరో ఫైరోఫాస్2 మీ/లీ లేదా ప్రోఫి నోఫాస్2 మి/లీ. ఆకుమచ్చ తెగులుకు మ్యాంకోజబ్3గ్రా/లీ లేదా ఫెక్సా కోన జోల్ 2మి/నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు, అదేవిధంగా రైతులు చిరుధాన్యాలు తో అధిక లాభాలు పొందే అవకాశాలున్నాయన్నారు. ముఖ్యముగా రాగులు, సజ్జలు, కొర్రలు, జొన్నలు, ఆరుకలు తదితరులు పండించాలని వాటితోనే ప్రజలకు ఆరోగ్యం దృఢత్వం గా ఉంటుందని, తక్కువ నీటికే తక్కువ రోజులకే పంట చేతికందుతుందని, చిరు ధాన్యాలతో ప్రజలు అధికంగా వాడడంతో మార్కెట్లో మంచి ధరలు కూడా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు లక్ష్మీనరసింహ, గంగాధరప్ప, సరోజమ్మ, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డియస్సీ క్వాలిఫైడ్ నిరుద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయండి

విశాలాంధ్ర-గోరంట్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 1996 డీయస్సి క్వాలిఫైడ్ నిరుద్యోగ ఉపాధ్యాయులు బుధవారం ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ని కలసి న్యాయం చేయాలని కోరారు. మినిమమ్ టైం స్కేల్ పద్ధతిలో 1998 డియస్సి క్వాలిఫైడ్స్‌కు ఉపాధ్యాయులుగా నియమించి గత ప్రభుత్వం 1996 డియస్సీ క్వాలిఫైడ్స్‌ను విస్మరించినందున మాకు అన్యాయం జరిగిందని నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు,మంత్రి స్పందించి మీ విషయం పరిశీలించి ఖచ్చితంగా మీకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు.అనంతరం వ్యవసాయశాఖమంత్రి అచ్చెన్నాయుడు,మంత్రి సవిత, రెవిన్యూమంత్రి అనగాని సత్య ప్రసాద్‌లను కలిసి వినతిపత్రాలను అందజేసామన్నారు. ముఖ్యమంత్రి మరియు విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారని చెప్పారు, ఈ కార్యక్రమంలో గోపాల్, నందకుమార్, ఆజాద్, ఫణింద్రశర్మ, హనుమంతరాయుడు, ఉమామహేశ్వర్, లక్ష్మణ్బాబు, రవి, మాచర్ల, వెంకటరెడ్డి, ఏకంబరం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు పూర్తి దశలో అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: సీజనల్ వ్యాధులపై ప్రజలకు పూర్తిదశలో అవగాహన కల్పించాలని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సేల్వియా సల్మాన్ తెలిపారు. ఈసందర్భంగా స్థానిక ఎన్జీవో హోంలో హెల్త్ డివిజన్లోని ధర్మవరం, తాడిమర్రి, ముదిగుబ్బ, చేనేకొత్తపల్లి,రామగిరి, బత్తలపల్లిలోని 11 పీహెచ్సీలకు,6 యూపీహెచ్సీలకు అవగాహన శిక్షణా తరగతులను నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కార్యాలయ ఇన్చార్జ్ హరీష్ కుమార్ పాల్గొన్నారు. హరీష్ కుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రతిఉద్యోగి ప్రజలకు అవగాహన కల్పించుటలో సఫలీకృతులు కావాలని, అప్పుడే గ్రామ, పట్టణాలలో ప్రజలు ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం డాక్టర్ సేల్వియా సల్మాన్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడేగా పాటించాలని, నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమకాటు ఆరోగ్యానికి చేటు అని, దోమ తెరలు వాడడం ద్వారా దోమ కాటును నివారించాలని, డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, బోధకాలు, మెదడు వాపు వ్యాధి రాకుండా అప్రమత్తంగా ప్రజలు ఉండే విధంగా కృషి చేయాలని తెలిపారు. మరేరియా సబ్ యూనిట్ కార్యాలయం ద్వారా సమన్వయంతో ఆరోగ్యం పట్ల ముందుకు వెళ్లాలని సూచించారు. వ్యాధుల నివారణ ఉత్తమ రక్షణగా ఉండాలని, అతిశారా వ్యాధి నుండి పిల్లలను రక్షించాలని, మలేరియా రహిత సమాజంగా చేయాలని, మలేరియా వ్యతిరేక పోరాటాన్ని వేగవంతం చేయాలని, విరోచనాల వల్ల కలిగే ప్రాణ నష్టాలని ఆపాలని, ఓఆర్ఎస్ దక్షిణ జింక్ శక్తితో నీల విరోచనాలుమటుమాయం చేయవచ్చునని తెలిపారు. ఏ గ్రామంలో గాని, పట్టణంలో గాని ఆరోగ్య విషయాలపై ఫిర్యాదు అందితే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. విహెచ్ శీల మెడికల్, డాక్టర్లు,యూపీహెచ్సీల మెడికల్ డాక్టర్లు, సబ్ యూనిట్ మలేరియా ఆఫీసర్ జయరాం నాయక్, ఏఎన్ఎంలు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే బీసీల అభ్యున్నతి- మంత్రి సవిత

విశాలాంధ్ర-పెనుకొండ:తమపార్టీ బీసీల పార్టీ అని, వెనుకబడిన తరగతులను అన్నిరంగాల్లోనూ అభివృద్ధే చంద్రబాబు ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆమెను బీజేపీ యువ మోర్చా నాయకులు గురువారం కలిసి, పలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీల ఆశీర్వాదంతోనే తెలుగుదేశం పార్టీ ఆవిర్భావించిందన్నారు. బీసీలకు రాజ్యాధికారం కల్పిస్తూ, వారిని అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకెళ్లేలా తమ పార్టీ ఆది నుంచి కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబు బీసీల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. ఒకవైపు బీసీలను రాజ్యాధికారంలో భాగం చేస్తూనే,మరోవైపు ఆదరణ. బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు వంటి పథకాలతో చేయూతనందిస్తూ వస్తున్నారన్నారు. గడిచిన ఐదేళ్లలో జగన్ రెడ్డి బీసీలను ఓటర్లగా పరిగణిస్తూ, బీసీ కార్పొరేషన్ నిధులను పక్కదారి పట్టించారన్నారు. ఆదరణ పథకాన్ని నిలిపేసి,బీసీల కడుపుకొట్టారని మండిపడ్డారు.జగన్ రెడ్డి అరాచకాలను టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కూటమిగా ఎదుర్కొని విజయం సాధించారన్నారు. కూటమి గెలుపులో మూడు పార్టీలు భేషజాలకు పోకుండా ఐక్యంగా ముందుకు సాగారంటూ బీజేపీ యువ మోర్చా నేతలను అభినందించారు. ఈసందర్భంగా బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆర్.గోపి శ్రీనివాస్.పలు సమస్యలతో కూడిన వినతిపత్రం మంత్రికి అందజేశారు. యువ మోర్చా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, లీగల్‌సెల్ స్టేట్ కన్వీనర్ చంద్రశేఖర్ యాదవ్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు చిన్ని చిట్టిబాబు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో రైతుల వాగ్వివాదం

విశాలాంధ్ర-గోరంట్ల: 15మంది రైతులకు సంబంధించిన 15 సర్వేనెంబర్లలోఎలాంటి ఆధారాలు లేకుండా కనీసం సాగులో కూడా లేని ఏడీసీ మండలానికి చెందిన వ్యక్తికి అక్రమంగా రికార్డుల్లో చేర్చారని ఆగ్రహించిన రైతులు తహశీల్దార్ కార్యాలయం చేరుకొని తహసిల్దార్ అక్బర్‌బాషతో వాగ్వాదానికి దిగిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. మండలంలోని వానవోలు పంచాయతీ గుంటువల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డి రైతుకు చెందిన మూడున్నర ఎకరా వేణుగోపాల్ రెడ్డి కి చెందిన రెండున్నర ఎకరా ఎస్ భయపరెడ్డికి చెందిన 50 సెంట్లు ఆదినారాయణ రెడ్డికి చెందిన 90 సెంట్లు ఎం వెంకట శివారెడ్డి చెందిన ఎకరా 40 సెంట్లు గుంటువల్లి నాగేష్‌కు చెందిన 48 సెంట్లు జి ఈశ్వరయ్యకు చెందిన 53 సెంట్లు, లక్ష్మీనరసమ్మ తిమ్మప్ప కేశవ కు చెందిన 2.45 సెంట్లు, తోపాటు ప్రభుత్వ పాఠశాల సర్వేనెంబర్ 510 రెండవ లెటర్ లో ఎకరా 16 సెట్లు ఈనెల 22వ తేదీన 11 ఎకరాలను ఓడిసి మండలం కొండకమర్లకు చెందిన ఈశ్వర్ రెడ్డి పేరున ఎలా చేర్చారని ఆందోళనకు దిగారు. దీంతో విఆర్ఓ మరియు ఆర్ఐ నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని గతంలోనే దీనిపై వినతిపత్రం కూడా అందించడం జరిగిందన్నారు. రైతులు సమస్యను వివరించిన కూడా ఎలా రికార్డులలో చేర్చారని, ఒక రైతు పెట్రోల్ బాటిల్ తో మండిపడ్డాడు. దీంతో తహసిల్దార్ పుట్టపర్తి ఆర్డిఓ మరియు జిల్లా అధికారులతో సమస్యను వివరించి వెంటనే గతంలో ఉన్న మాదిరిగా దానిని మార్పు చేయడంతో సమస్య సద్దుమరిగింది. ఇలాంటి సంఘటన మళ్లీ పునరావతమైతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు, లక్ష్మీనారాయణ రెడ్డి, నాగేష్ ,మునీంద్ర, వెంకటరెడ్డి, వేణుగోపాల్, భయపరెడ్డి, సత్యనారాయణ, తిరుపాల్, రామిరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఆదినారాయణ, రంగారెడ్డి తదితరులు రైతులు పాల్గొన్నారు.